సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



మద్దతు ధర ప్రకటిస్తే..
ఆయిల్‌పామ్ సాగు పెరుగుతున్నా గెలల ధర అమాంతం తగ్గడంతో రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. IIలో



ఇన్‌చార్జ్ పాలనలో..
ఆర్డీఓను గత నెలలో బదిలీ చేయగా, ఆయన స్థానంలో మరొకరిని నియమించకుండా ఇన్‌చార్జ్‌తో కొనసాగిస్తున్నారు. IIలో

గరిష్ఠం/కనిష్ఠం
42°/25°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

29న 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు రబీలాల్ దాస్, కె.సునీల్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఆన్‌లైన్ సేవల విధి విధానాలు, పెన్షనర్ల సమస్యలు, జీవన ప్రమాణ్ సేవల్లో సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లావాసులు భద్రాచలంలోని దివ్య హైస్కూల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

అధ్యాపకుల డెమోను పరిశీలించిన పీఓ


భద్రాచలం: భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకుల డెమో క్లాసులను శుక్రవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ స్వయంగా పరిశీలించారు. శుక్రవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని సబ్జెక్ట్‌ల లెక్చరర్ల డెమో క్లాసుల తర్వాత ఆయన మాట్లాడారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, డీఈఓ వెంకటేశ్వరాచారి, వీరూ నాయక్, భవాని, రమణయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

గుండాల: గ్రామాల్లో వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఆదేశించారు. శుక్రవారం పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చేతిపంపులు పనిచేసేలా చూడాలన్నారు. అధికారులు రమణారావు, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని విజయవాడ గీతా మందిరం కాలనీకి నండూరి సాయిబాబు – వెంకట సత్యవాణి దంపతులు రూ.50 వేల విరాళం అందించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి శ్రీనివాస్ పాల్గొన్నారు.



2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భద్రాచలం స్థానం రద్దయి కొత్తగా మహబూబాబాద్ కేంద్రంగా పార్లమెంటు స్థానం ఏర్పడింది. దీని పరిధిలోకి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్.. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం.. మూడు అసెంబ్లీ స్థానాలు వచ్చాయి. దీంతో సామాజిక సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఫలితంగా మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నికలు జరగగా, మూడుసార్లు లంబాడీ సామాజికవర్గానికి చెందిన నేతలు ఎన్నికయ్యారు. ఈసారి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల తరఫున లంబాడీ సామాజికవర్గానికి చెందిన నేతలే ప్రముఖంగా ఉన్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన కుంజా శ్రీనివాసరావు సీపీఐ తరఫున పోటీ చేసి రెండో స్థానానికే పరిమితమయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున తెల్లం వెంకట్రావు చెప్పుకోతగ్గ స్థాయిలో ఓట్లు సాధించారు.

ఏడు అసెంబ్లీ స్థానాలు

అప్పుడు ఆదివాసీ.. ఇప్పుడు లంబాడీ

రద్దయిన భద్రాచలంలో ఆదివాసీలదే ఆధిపత్యం
- ఆ తర్వాత మహబూబాబాద్ కేంద్రం లోక్‌సభ స్థానం
- అప్పటి నుంచి లంబాడీ సామాజిక వర్గానిదే గెలుపు
- రెండు సార్లు దక్కిన కేంద్రమంత్రి పదవులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన జనాభా ఎక్కువగా ఉండి, ఎస్టీలకు రిజర్వ్ చేసిన మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో లంబాడా సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులే వరుసగా గెలుస్తూ వస్తున్నారు. గతంలో భద్రాచలం పార్లమెంట్ నియోజకవర్గం ఉన్నప్పుడు ఆదివాసీలదే పైచేయిగా ఉండేది.

కాంగ్రెస్‌దే పైచేయి

భద్రాచలం పార్లమెంటు స్థానానికి తొలిసారిగా 1967లో ఎన్నికలు జరగగా చివరిగా 2004లో ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున రాధాబాయి ఆనందరావు గెలుపొందారు. చివరిసారి సీపీఎం తరఫున మిడియం బాబూరావు ఇక్కడి నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. మొత్తంగా 11 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రతీసారి కోయ లేదా ఆదివాసీ ఉప కులాల వారే ఇక్కడి నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. గిరిజనుల్లో మరో ప్రధాన తెగగా ఉన్న లంబాడీలకు భద్రాచలం నుంచి గెలిచే అవకాశం పెద్దగా రాలేదు. ప్రతీసారి ప్రధాన పార్టీల తరఫున ఆదివాసీ తెగల వారే బరిలో నిలిచారు.

రెండుసార్లు మంత్రి పదవులు

భద్రాచలం పార్లమెంటు స్థానం నుంచి 11 సార్లు ఎన్నికలు జరగ్గా, ఆరుగురు అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించారు. 1991లో గెలిచిన కర్రెద్దుల కమలకుమారికి కేంద్ర కేబినెట్‌లో సంక్షేమ శాఖ మంత్రిగా చోటు దక్కింది. ఇక పునర్విభజన తర్వాత 2009లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో గెలిచిన బలరాం నాయక్ యూపీఏ-2 ప్రభుత్వంలో అనూహ్యంగా కేబినెట్ బెర్త్ దక్కించుకున్నారు. మొత్తంగా మహబూబాబాద్(భద్రాచలం)స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరగగా 10 సార్లు కాంగ్రెస్, మూడు సార్లు సీపీఐ, రెండు సార్లు బీఆర్ఎస్, టీడీపీ, సీపీఎంలు చెరోసారి గెలుపొందాయి.

మానుకోట నుంచి భద్రాచలం

పార్లమెంటుకు జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల నాటికి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైంది. తొలినాళ్లలో ఈ నియోజకర్గం జనరల్ స్థానంగా కొనసాగింది. 1957, 1962, 1965లలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో మహబూబాబాద్ స్థానం రద్దయ్యింది. కొత్తగా భద్రాచలం (ఎస్టీ) పార్లమెంటు స్థానం ఏర్పాటైంది. భద్రాచలం (ఎస్టీ) పార్లమెంటు పరిధిలో ప్రస్తుతం తెలంగాణలోని భద్రాచలం, పినపాక (బూర్గంపాడు) అసెంబ్లీ స్థానాలతోపాటు తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లా పరిధిలో మరో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండేవి. ఈ నియోజకవర్గం మొత్తం దట్టమైన అడవులతో విస్తీర్ణం పరంగా చాలా పెద్దదిగా ఉండేది.

బ్లడ్ బ్యాంక్ లేక..

- ఎంసీహెచ్‌లో గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు
- రక్తం ఎక్కించాలంటే సర్వజన ఆస్పత్రికి వెళ్లాల్సిందే..
- అత్యవసర సమయంలో వైద్యం అందక ప్రాణాల మీదకు..



రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)ను సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో సరైన వైద్యం అందక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ. 17 కోట్లతో నిర్మాణం చేపట్టారు. 2022 నుంచి వైద్య సేవలందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రామవరం ఎంసీహెచ్‌ను ఏర్పాటు చేయగా, వంద పడకలతోపాటు చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఏపీ సరిహద్దు ప్రాంతాల గర్భిణులు కూడా ఎంసీహెచ్‌కు వస్తున్నారు. రోజుకు సుమారు 500కు పైగా ఓపీ ఉంటోంది. నెలకు 300పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. రద్దీ పెరగడంతో ఆస్పత్రిలో పడకల సంఖ్యను 160కు పెంచారు.

వైద్యుల నిర్లక్ష్యం కూడా..

గర్భిణులకు కాన్పు, శస్త్ర చికిత్స తర్వాత రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రక్తం అందుబాటులో ఉంచాలి. కానీ ఎంసీహెచ్‌లో బ్లడ్ బ్యాంక్ లేదు. గర్భిణులకు అత్యవసర సమయాల్లో రక్తం ఎక్కించాలంటే.. ఎంసీహెచ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా సర్వజన ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరే గర్భిణులకు ఇబ్బందులు తప్పడంలేదు. అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక బాలింతలు ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మరణాలు సంభవిస్తున్నాయి. జూలూరుపాడు మండలానికి చెందిన గర్భిణి బోడ చంద్ర బుధవారం రాత్రి ఆస్పత్రిలో చేరి, ప్రసవం పొందాక అధిక రక్తస్రావం, వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన విషయం విదితమే. డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సకాలంలో రక్తం ఎక్కించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. ఎంసీహెచ్‌లో బ్లడ్ బ్యాంక్ లేకపోవడం వల్ల, అక్కడి నుంచి సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లడంలో కూడా జాప్యం జరిగిందని పేర్కొంటున్నారు.

వెంటిలేటర్ ఏర్పాటులో జాప్యం

గర్భిణులు, నవజాత శిశువులు అపసార్మక స్థితిలో ఉంటే ఐసీయులో వెంటిలెటర్ మీద ఉంచి చికిత్స అందించాలి. కానీ ఇక్కడ ఐసీయూ లేదు. దీంతో వారిని సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తోంది. దీంతో గోల్డెన్ అవర్స్‌లో వైద్యం అందక ప్రాణాల మీదకు వస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంసీహెచ్‌లో బ్లడ్ బ్యాంక్, ఐసీయూ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రెండో దశ ర్యాండమైజేషన్ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక



ఎన్నికల వ్యయ పరిశీలకుడికి మొక్క అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్‌తో కలిసి ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 9 ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించినట్లు చెప్పారు. రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా 1,162 ప్రిసైడింగ్ అధికారులు, 1,162 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,324 ఓపీఓలను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని అన్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్ఐసీ డీఐఓ సుశీల్‌కుమార్, డీఎల్ఎంటీ పి.సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడిని కలిసిన ఎస్పీ

కొత్తగూడెంటౌన్: పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్‌ను శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

నలుగురి నామినేషన్ల తిరస్కరణ

- లోక్‌సభ పోటీలో మిగిలింది 41మంది
- ఉపసంహరణ అనంతరం తేలనున్న లెక్క

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ల స్క్రూటినీ శుక్రవారం పూర్తయింది. ఈమేరకు పరిశీలనలో నలుగురి నామినేషన్లను తిస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈనెల 18నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా 45మంది అభ్యర్థులు 72సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. వీరిలో నలుగురివి తిరస్కరించగా జాబితాలో 41మంది మిగిలారని తెలిపారు.

తిరస్కరణకు గురైంది వీరే

నాగ సీతారాములు, రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ పేరుతో నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, వీరిద్దరూ ఫామ్ – ఏ, బీ సమర్పించకపోవడం, ఒకరే ప్రతిపాదించడంతో తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే, యువతరం పార్టీ పేరుతో గాజుల వేణుగోపాల్‌రెడ్డి సమర్పించిన నామినేషన్‌లో పలు వివరాలు భర్తీ చేయకపోవడంతో తిరస్కరించారు. ఇక గోన్‌ద్వానా దండకారణ్య పార్టీ తరఫున శెట్టిపల్లిశ్రీను నామినేషన్ దాఖలు చేసినా, ఫామ్-26 అసంపూర్తిగా ఉండడంతో తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు.

29వ తేదీన తేలనున్న లెక్క

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్క్రూటినీ శుక్రవారం పూర్తికాగా, ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరించుకునే అవకాశముంది. దీంతో 41మందిలో ఎంత మంది బరిలో మిగులుతారో ఆరోజు తేలనుంది.

మానుకోటలో ఐదుగురివి తిరస్కరణ

మహబూబాబాద్: మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. మొత్తంగా 30 మంది అభ్యర్థులు 56 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో ఐదుగురు అభ్యర్థుల పత్రాలు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారు. ఈమేరకు జాబితాలో 25 మంది మిగిలారని ఎన్నికల అధికారులు తెలిపారు.

రఘురాంను గెలిపించాలి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి తుమ్మల, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు

- ఆగస్టు 15 లోగా రుణమాఫీ
- మంత్రులు పొంగులేటి, తుమ్మల

అశ్వారావుపేట: ఖమ్మం పార్లమెంట్ సభ్యుడిగా రామసహాయం రఘురాంరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గం శుక్రవారం దమ్మపేట మండలం వడ్లగూడెం వద్ద ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్‌లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. తాను ఖమ్మం, మంత్రి తుమ్మల మహబూబాబాద్‌లకు ఇన్‌చార్జ్‌గా ఉన్నామని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్రవ్యాప్తంగా 17 మంది అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటే రాష్ట్రంలో 17 సీట్లకు కనీసం 15 స్థానాలు గెలిపించాలన్నారు. ఆగస్టు 15 లోగా రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీ చేయకుండా, ఇప్పుడు కారుకూతలు కూస్తున్నారని విమర్శించారు. దోచుకున్నది దాచుకోవడం కోసమే కేసీఆర్ ఉద్యమం చేస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలకులు చెప్పిన మాట చెప్పకుండా, వేసిన డ్రస్సు వేయకుండా, తిరిగిన దేశం తిరగకుండా గడిచిన పదేళ్లలో దేశ ప్రజలను ఎలా మోసం చేశారో గమనించాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 'మీరు 15 రోజులు కష్టపడండి.. మిగతా రోజులు మీకు జీతం చేసే బాధ్యత మాది' అని నాయకులను ద్దేశించి పేర్కొన్నారు. బీజేపీ నాయకులు భావోద్వేగాలను వాడుకుని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళసూత్రాలు తీసుకెళ్లి ముస్లింలకు ఇస్తారని, ఆస్తులను లాక్కుంటారని దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రధాని స్థాయిలో ఉండి బజారు మనిషిలా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు సమకాలికుడని, ఆయన కూడా దిగజారి పల్చబడి మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆయిల్‌పామ్ ధర ఇంకా పెరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌పాల్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. తుదిశ్వాస వరకు ప్రజాసేవకు అంకితమవుతానని పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో చేరే వారిని స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించి చేర్చుకోవాలని, గతంలో ఇబ్బందులకు గురిచేసిన వారుంటే ఎమ్మెల్యేతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. 'మా ఎన్నికలు అయిపోతున్నాయ్. ఇక నుంచి మీ ఎన్నికలే. మీకు మా అవసరం ఉంటుంది.' అంటూ కొందరు స్థానిక నాయకులకు తుమ్మల చురకలంటించారు. ఇంకా ఈ సభలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మాట్లాడారు.

అన్ని వాహనాలు తనిఖీ చేయాలి

కొత్తగూడెంరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న చెక్ పోస్టును శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి విక్రాంత్ సింగ్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

పేలవంగా గురుకుల ఫలితాలు

- గిరిజన గురుకులాల్లో తగ్గిన ఇంటర్ ఉత్తీర్ణతా శాతం
- ఐటీడీఏ పీఓ దృష్టి సారించినా మెరుగుపడని వైనం
- ఏటా మెమోలతో సరిపుచ్చుతున్న అధికారులు
- రాష్ట్రస్థాయి మార్కులతో మెరిసిన ఎక్స్‌లెన్స్ కళాశాలలు



ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్ సాధించిన పూజితను అభినందిస్తున్న భద్రాచలం సీఓఈ ప్రిన్సిపాల్

భద్రాచలం: ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో వెనుకబడుతున్నాయి. ప్రతి ఏటా ఉత్తీర్ణతా శాతం తగ్గిపోవడమే తప్ప మెరుగైన పనితీరు కనబర్చలేకపోతున్నాయి. ఈ ఏడాది ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ప్రత్యేక దృష్టి సారించినా ఆశించిన ఫలితం రాలేదు. ఫలితాలు తక్కువగా వచ్చిన కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు, అధ్యాపకులకు మెమోలు జారీ చేసినా మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో గురుకుల విద్య, ఫలితాలను పరిశీలనాత్మకంగా చూడాల్సిన అవసరం ఉంది.

పీఓ దృష్టి సారించినా..

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ గిరిజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులను నిరంతరం మానిటరింగ్ చేస్తూ, ఉత్తీర్ణతా శాతం పెరగాలని ఆదేశాలు జారీ చేసినా ఫలితాలు మెరుగుపడలేదు. ఫస్టియర్‌లో గతేడాది కంటే 10.13 శాతం, సెకండియర్‌లో 4.48 శాతం తగ్గటం గమనార్హం. అతి తక్కువ ఫలితాలు సాధించిన కళాశాలల ప్రిన్స్‌పాల్స్, సబ్జెక్టుల అధ్యాపకులకు ఏటా మెమోలను జారీ చేసి, వేతనం తగ్గిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మెమోలతో ఉత్తీర్ణత పెరుగుతుందా?

కోవిడ్ ప్రభావంతో రెండు విద్యా సంవత్సరాల్లో విద్య కుంటుపడిందని, ఆ ప్రభావం ఇప్పటికీ ఫలితాలపై చూపుతోందని విద్యావేత్తలు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మెమోలతో ఉత్తీర్ణతా శాతం పెరుగుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఏటా ఫలితాలు వెలువడ్డాక ఇదో తతంగంలా మారిందే తప్ప మార్పు రావడం లేదని అభిప్రాయపడుతున్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలంటే ప్రాథమిక విద్య, కనీస అభ్యాసన సామర్థ్యాలు, గణితం, ఆంగ్లం, ఫిజిక్స్ వంటి క్లిష్టతరమైన సబ్జెక్టులలో మెరుగైన శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు సైతం నేటి ఆధునిక విద్యా వ్యవస్థకు తగినట్లు శిక్షణ ఉండాలని, ఆ దిశగా ఐటీడీఏ అధికారులు కృషి చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

ఎక్స్‌లెన్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

ఖమ్మంకు చెందిన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎస్ఓఈ), భద్రాచలానికి చెందిన కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) విద్యార్థులు అత్యుత్తమ మార్కులు పొంది రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా సత్తా చాటారు. ఎంపీసీ సెకండియర్ ఫలితాల్లో భద్రాచలం సీఓఈకి చెందిన కె.చందన 982/1000, ఖమ్మంలోని ఎస్ఓఈకి చెందిన కె.యుగంధర్ 975/1000, బైపీసీ విభాగంలో ఖమ్మం ఎస్ఓఈకి చెందిన జె.ఆకాశ్ 980/1000, తర్వాత స్థానంలో భద్రాచలం సీఓఈకి చెందిన పి.శ్రావణి, అనుశ్రీ సాయి 978/1000 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో భద్రాచలం సీఓఈకి చెందిన బి.పూజిత 467/470, ఖమ్మం ఎస్ఓఈకు చెందిన బి.భానుకుమార్ 465/470 సాధించగా, బైపీసీలో వైరా కళాశాలకు చెందిన బి.లేఖన 428/470, భద్రాచలం సీఓఈకి చెందిన ఈ.అనిత 427/470తో ప్రథమ స్థానాలలో నిలిచారు.

కొన్ని కళాశాలలు డల్

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫలితాల్లో గతేడాది కంటే ఉత్తీర్ణత తగ్గింది. సెకండియర్ కంటే ఫస్టియర్‌లో ఫలితాలు పడిపోయాయి. ఫస్ట్ ఇయర్‌లో గతేడాది 80.54 శాతం సాధించగా, ఈ ఏడాది 70.41 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది సెకండియర్‌లో 87.75 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 83.27 శాతం వచ్చింది. కళాశాలల వారీగా పరిశీలిస్తే ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో సింగరేణి కళాశాలలో కేవలం 6.45 శాతంతో అట్టడుగు స్థాయిలో నిలిచింది. తిరుమలాయపాలెం 30.95, కృష్ణసాగర్ 33.77 శాతానికే పరిమితమయ్యాయి. సెకండియర్‌లో కూడా సింగరేణి కళాశాల 56.62 శాతం, తిరుమలాయపాలెం 60.53, కృష్ణసాగర్ 63.29 శాతంతో చివరిస్థానాల్లోనే నిలిచాయి.

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

కనకదుర్గమ్మకు పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్య సన్నిధిలో ఖమ్మం జిల్లా జడ్జి


పెద్దమ్మతల్లి సన్నిధిలో జడ్జి జగ్జీవన్‌కుమార్, కుటుంబ సభ్యులు

భద్రాచలం/పాల్వంచరూరల్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శుక్రవారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నా రు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తుల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అలాగే పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయాన్ని కూడా జగ్జీవన్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఈఓ సుదర్శన్ అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సామాజిక మాధ్యమాల్లో జోష్

భద్రాచలంఅర్బన్: ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే హడావుడిగా ఉండేది. భారీ ర్యాలీలు, మైక్‌ల హోరుతో ప్రచారం జోరుగా సాగేది. కానీ, ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఎక్కువగా ఉండటం.. ప్రచార వ్యవధి తక్కువగా ఉండటమే కాక ఎండల తీవ్రతతో ఎక్కువగా కార్నర్ మీటింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రచారం చేస్తూ మిగతా దంతా సామాజిక మాధ్యమాల ద్వారా నడిపిస్తున్నారు. ఎక్కువ మందికి ఇంటర్నెట్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్లు ఉండటంతో అభ్యర్థుల గుణగణాలు, ఫొటోలు, వీడియోల ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో కొనసాగిస్తున్నారు. ఇందుకోసం ప్రతీ అభ్యర్థి, పార్టీలు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నాయి.

ఆరు శాతం ఓట్లు వస్తేనే గుర్తింపు!

భద్రాచలంఅర్బన్: తరచుగా జాతీయ, ప్రాంతీయ పార్టీలని వినిపిస్తుంటుంది. ఎన్నికల సమయాన ఇది మరింత ఎక్కువ! జాతీయ పార్టీలను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రచారంలో చెబుతుండటం పరిపాటి. అయితే, ఏ పార్టీ జాతీయం, ఏది ప్రాంతీయం అనేది కేంద్ర ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. ఒక సార్వత్రిక ఎన్నికల్లో ఏదైనా ఒక పార్టీ ఏవైనా నాలుగు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో పోలైన ఓట్లలో ఆరు శాతం ఓట్లు సాధిస్తే జాతీయ పార్టీగా గుర్తిస్తారు. ఒక రాష్ట్రంలో ఆరు శాతం ఓట్లు వస్తే ప్రాంతీయ పార్టీగా చెబుతారు. ఈ మేరకు ఆయా పార్టీల నుంచి ఎక్కడ అభ్యర్థి పోటీ చేసినా ఒకే గుర్తు కేటాయిస్తారు.

ఏకగ్రీవంగా ప్రభుత్వ డాక్టర్ల సంఘం ఎన్నిక


బి.బాబురత్నాకర్


సైదులు

ఖమ్మంవైద్యవిభాగం: తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాబురత్నాకర్, ప్రధాన కార్యదర్శిగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్‌లో విభేదాలతో ఏళ్లుగా ఎన్నిక జరగకపోగా, కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ నెల 22 వరకు నామినేషన్లు స్వీకరించారు. అయితే, పోటీ లేకపోవడంతో కమిటీ ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాబు రత్నాకర్, సైదులుతో పాటు కోశాధికారిగా డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రామూనాయక్, వేణుమాధవ్, సుజన, సంయుక్త కార్యదర్శిగా జి.శ్రీదేవితో పాటు ఇతర పదవులకు డాక్టర్ కృపాఉషశ్రీ, బొల్లికొండ శ్రీనివాసరావు, బాలు, పి.రవికుమార్, కె.ప్రేమ్‌జ్యోతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ కె.రామ్మూర్తి వెల్లడించారు.

కలెక్టర్‌కు నివేదిక..

సూపర్‌బజార్(కొత్తగూడెం): షోకాజ్ నోటీసుకు డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ బదులివ్వగా ఆ నివేదికను కలెక్టర్ ప్రియాంక ఆలకు అందజేసినట్లు కొత్తగూడెం ఏఆర్ఓ మధు తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబుతో కలిసి 3194 డైరీని ఆవిష్కరించిన విషయం విదితమే. దీనిపై ఎన్నికలకోడ్ ఉల్లంఘించారని ఫిర్యాదులు అందగా కొత్తగూడెం నియోజకవర్గ ఏఆర్ఓ మధు వివరణ కోరుతూ డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీకి సంబంధించిన యూనియన్ కాదని, డైరీలోని జి.సంజీవరెడ్డి ఫొటో యూనియన్ నాయకుడిగానే ఉందని, అందుకే ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నామని వారు ఇచ్చిన వివరణను కలెక్టర్‌కు అందజేసినట్లు వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

మద్దతు ధర ప్రకటిస్తేనే..

మరింతగా ఆయిల్‌పామ్ సాగు

- పామాయిల్ గెలలు టన్ను ధర రూ.14,174
- రెండేళ్లతో పోల్చుకుంటే భారీగా తగ్గిన రేటు
- మరోవైపు పెరగని జీడిమామిడి, మామిడి సాగు


పామాయిల్ తోట

దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగు ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతున్నా గెలల ధర అమాంతం తగ్గడంతో రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తే రైతులు ఎక్కువమంది మొగ్గు చూపే అవకాశం ఉంది. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకోగలగడం, పంట నష్టం వాటిల్లకుండా నిలడగలిగే పంట కావడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుకే ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ గెలల ధర ఆశించిన స్థాయిలో లేకపోయినా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నేలలు కూడా అనుకూలంగా ఉండటంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీపై మొక్కల పంపిణీ, బిందు సేద్య పరికరాలు, స్థానికంగా పామాయిల్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండటం ఇందుకు దోహదం చేస్తున్నాయి. కొన్నేళ్లుగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించారు. మరోవైపు ఉద్యాన పంటలైన జీడిమామిడి, మామిడి సాగు విస్తీర్ణం పెరగడంలేదు.

అంతర పంటలతోనూ ఆదాయం

భారీ తుపాన్లు, గాలులు వీచినా ఆయిల్‌పామ్ తోటలు దెబ్బతినే అవకాశం లేదు. ఒకవేళ ఆయిల్‌పామ్ గెలల నుంచి గింజలు రాలిపడినా, వాటిని గెలలతో కలిపి విక్రయించవచ్చు. సాగు ప్రారంభంలో మొదటి మూడేళ్ల అంతర పంటలుగా మొక్కజొన్న, పుచ్చకాయ, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు. అంతర పంటల సాగు వల్ల సూక్ష్మపోషకాలు సరైన మోతాదులో అంది ఆయిల్‌పామ్ దిగుబడి లేత దశలోనే వచ్చే అవకాశముంది. ఇక కోకో పంటను శాశ్వత అంతర పంటగా సాగు చేయొచ్చని ఉద్యానవన అధికారులు చెబుతున్నారు.

ధర రూ.23 వేల నుంచి రూ. 14 వేలకు..

పామాయిల్ గెలలు టన్ను ధర 2010 జనవరిలో రూ.4,248 ఉండేది. క్రమంగా పెరుగుతూ 2020 జనవరి నాటికి రూ.10,809కు చేరుకుంది. 2022 జూన్ నాటికి గరిష్టంగా రూ.23,467 చేరుకుని రికార్డు సృష్టించింది. అనంతరం ఆయిల్‌పామ్ ఉత్పత్తుల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం తగ్గించడంతో ధర తగ్గుముఖం పట్టింది. టన్ను ధర రూ.12 వేలకు పడిపోయింది. మళ్లీ కొంత పెరిగి, ప్రస్తుతం రూ.14,174కు చేరుకోవడంతో రైతులకు కొంతమేర ఉపశమనం పొందుతున్నారు. ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో కనీస మద్దతు ధర టన్నుకు రూ.20 వేలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

స్థిరంగా జీడిమామిడి, మామిడి సాగు

వేసవి కాలం పంటలైన జీడిమామిడి, మామిడి సాగు విస్తీర్ణం పెరగడంలేదు. అశ్వారావుపేట ప్రాంతంలో ఏటేటా విస్తీర్ణం తగ్గిపోతోంది. అయితే జిల్లా వ్యాప్తంగా ఉద్యాన శాఖ గణాంకాల ప్రకారం గత మూడేళ్లుగా జీడి మామిడి, మామిడి సాగు విస్తీర్ణం నిలకడగా ఉంది. ఈ తోటల్లో పూతదశ నుంచే సస్య రక్షణకు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి రావడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు అతివృష్టి, గాలి దుమ్ముల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. జీడిమామిడి కాయలు, గింజల సేకరణకు, మామిడి కాయల కోతకు కూలీల ఖర్చు కూడా ఎక్కువగానే ఉంటోంది. ఈనేపథ్యంలో రైతులంతా ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో గత నాలుగేళ్లలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)

సంవత్సరం	పామాయిల్	జీడిమామిడి	మామిడి
2020-21	34,556	11,719	11,315
2021-22	38,794	11,058	9,270
2022-23	55,302	11,058	9,270
2023-24	64,253	11,058	9,270


జీడిమామిడి తోట

నష్టాలు లేవు



గతంలో మాకు మూడెకరాల జీడిమామిడి, ఐదెకరాల మామిడి తోటలు ఉండేవి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీవ్రంగా పంట నష్టపోయాం. దీంతో ఆ తోటలను తొలగించి ఎనిమిది ఎకరాల్లో ఎనిమిదేళ్ల క్రితం పామాయిల్ సాగు మొదలు పెట్టాను. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ఆశించిన ధర లేదు. అయితే నష్టం మాత్రం రావడంలేదు. ఇతర పంటలతో పోలిస్తే శ్రమ కూడా తక్కువే. పామాయిల్‌కు కనీస మద్దతు ధర టన్నుకు రూ.20 వేలు చెల్లిస్తే సాగు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

–చిన్నశెట్టి అప్పారావు, పామాయిల్ రైతు

పెరుగుతున్న ఆయిల్‌పామ్



ఆయిల్‌పామ్ సాగు గణనీయంగా పెరుగుతోంది. జీడిమామిడి, మామిడి పంటల సాగులో మార్పు రాలేదు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడటంతోపాటు సాగు ఖర్చులు తక్కువ. అందుకే రైతులు పామాయిల్‌పై ఆసక్తి చూపుతున్నారు. జీడిమామిడి, మామిడి పంటలతో పోల్చితే పామాయిల్‌కు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఎక్కువ. పంట అమ్మకానికి స్థానికంగా ఫ్యాక్టరీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆయిల్‌పామ్ రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు.

–సందీప్, ఉద్యానశాఖ అధికారి

స్థిరీకరణకు ప్రయత్నిస్తున్నాం



ఉద్యాన పంటల సాగు స్థిరీకరణకు ప్రయత్నిస్తున్నాం. పామాయిల్ సాగును ప్రోత్సహిస్తూనే మానవాళికి అవసరమైన జీడిమామిడి, మామిడి పంటలు అంతరించిపోకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో జీడిమామిడి, మామిడి తోటల సాగు ఒక్కసారిగా తగ్గింది. అయితే మూడేళ్ల నుంచి వీటి సాగు పెరగకపోయినా స్థిరంగా ఉంది. పంట మార్పిడి చేసే రైతులను గుర్తించి ఖాళీగా ఉన్న మెరక భూముల్లో జీడిమామిడి, మామిడి పంటలు సాగుచేసేలా కృషి చేస్తాం.

–సూర్యనారాయణ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి

ఆరోగ్యం కాపాడుకోవాలి

కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారాన్ని తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని నారాయణపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఉచిత వైద్య, కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుమ్మడవల్లి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, ఆర్ఆర్ నేత్రాలయం వైద్యులు నరేంద్ర మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో అధిక ఎండల నుంచి జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. గ్రామస్తులకు ఆరోగ్య, కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

చిరుధాన్యాలపై అవగాహన

నారాయణపురంలోని రైతు వేదిక ఆవరణలో గ్రామ రైతులకు చిరుధాన్యాలు, సాగులో పాటించాల్సి జాగ్రత్తలపై వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జెస్సీ సునీత అవగాహన కల్పించారు. జొన్న, కొర్రల సాగు గురించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి, చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రస్తుతం మార్కెట్ అందుబాటులో ఉన్న యంత్ర పరికరాలపై శాస్త్రవేత్త డాక్టర్ జంబంబ వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ రెడ్డి ప్రియ, డాక్టర్ రమేష్, కళాశాల అధ్యాపకులు జగదీశ్వర్, షేక్ అస్లాం , రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ హేమంత్ కుమార్

మద్యం పట్టివేత

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐ శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం అశ్వారావుపేట రింగ్‌రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. అశ్వారావుపేటకు చెందిన ఎస్‌కే మధార్ రూ.5,940 విలువ చేసే వివిధ రకాల మద్యం సీసాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. ఆ మద్యాన్ని జంగారెడ్డిగూడెం మార్గంలోని బెల్ట్ షాపునకు తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.70 వేలు సీజ్

కొత్తగూడెంఅర్బన్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి త్రీటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించగా ఆధారాలు లేని రూ.70 వేలు పట్టుబడ్డాయి. పాల్వంచ నుంచి ఖమ్మానికి వెళ్తున్న ఓ మహిళ దగ్గర రూ.70 వేలను పోలీసులు గుర్తించారు. ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశామని త్రీటౌన్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన భద్రాచలం ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్‌పంకజ్

భద్రాచలంఅర్బన్: ఇద్దరు మావోయిస్టులు శుక్రవారం భద్రాచలం ఏఎస్పీ ఎదుట లొంగిపోయారు. స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిస్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెమలగూడ గ్రామానికి చెందిన పోడియం ఇడుమయ్య, అదే గ్రామానికి చెందిన ఉయికే ముత్యాలక్క 2011 నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఇడుమయ్య మిలీషియా సభ్యుడిగా పనిచేస్తూ 2022లో నెమలగూడ ఆర్పీసీకి మిలీషియా కమాండర్‌గా నియమితుడయ్యాడు. ఉయికే ముత్యాలక్క నెమలగూడ ఆర్పీసీ దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ (డీఏకేఎంఎస్)లో సభ్యురాలిగా చేరిని, మావోయిస్టు కార్యకలాపాల్లో భాగస్వామి అయ్యారని ఏఎస్పీ తెలిపారు. ఎస్పీ రోహిత్ రాజ్ చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితులై కొంతకాలంగా మావోయిస్ట్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, దళ సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోతున్నారని వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సాయం కింద చెక్ రూపంలో కొంత నగదును ఏఎస్పీ అందించారు. కార్యక్రమంలో రాజువర్మ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పాల్వంచ: పట్టణంలో శ్రీనివాసకాలనీకి చెందిన బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బంధువులు, చుట్టుపక్కల వారిని వాకబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించక పోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిమ్ పనిచేయక ప్రయాణికుల ఇబ్బందులు

పాల్వంచరూరల్: పాల్వంచ బస్టాండ్ నుంచి మణుగూరుకు ప్రయాణికులతో బయలుదేరిన సూపర్ లగ్జరీ బస్సులో టికెట్ కొట్టే యంత్రం (టిమ్) పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బస్సును పెద్దమ్మగుడి వద్ద నిలిపివేసి, సుమారు 15 మంది ప్రయాణికులను మరో బస్సులో మణుగూరుకు తరలించారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం రాష్ట్రీయ రహదారి దాడుతున్న గొర్రెలను అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లింది.

ఆమే కీలకం!

- ఖమ్మం లోక్‌సభ పరిధిలో మహిళా ఓటర్లే ఎక్కువ
- పురుమలతో పోలిస్తే 56,589 మంది అధికం
- మొత్తం ఓటర్లు 16,31,039 మంది
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు

ఖమ్మం సహకారనగర్: వచ్చేనెల 13న జరగనున్న ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో మహిళలు ఎటు మొగ్గు చూపితే ఆ అభ్యర్థికే విజయం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి! ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అనంతరం ఓటర్ల తుది జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈమేరకు మొత్తం ఓటర్లు 16,31,039మంది ఉండగా.. ఇందులో పురుషులు 7,87,160, మహిళలు 8,43,749, ఇతరులు 130మంది ఉన్నారని జాబితాలో వెల్లడించారు. ఈ జాబితాలో పేర్లు ఉన్నవారే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశముంటుంది.

పెరిగిన ఓటర్లు

ఈనెల 16న వెల్లడించిన జాబితా ప్రకారం ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 16,26,427మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఆ జాబితా వెల్లడించే నాటికే కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. వీటిని పరిశీలించిన అధికారులు శుక్రవారం తుది జాబితా విడుదల చేయగా... 16,31,039మందిగా తేలింది. దీంతో గతంతో పోలిస్తే 4,612మంది ఓటర్లు పెరిగినట్లుగా వెల్లడించారు. పార్లమెంట్ స్థానం పరిధిలోని 1,084 ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న 1,896 పోలింగ్ కేంద్రాల్లో వీరు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,55,284	1,68,740	49	3,24,073
కొత్తగూడెం	1,19,477	1,27,979	38	2,47,494
సత్తుపల్లి	1,18,490	1,25,441	12	2,43,943
పాలేరు	1,15,717	1,25,081	08	2,40,806
మధిర	1,07,111	1,15,039	10	2,22,160
వైరా	93,700	99,683	06	1,93,389
అశ్వారావుపేట	77,381	81,786	07	1,59,174
మొత్తం	7,87,160	8,43,749	130	16,31,039

అన్నిచోట్ల అతివలే అధికం

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లు 16,31,039 ఉండగా ఇందులో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 56,589మంది ఎక్కువగా ఉన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండడంతో గెలుపోటముల్లో వీరి పాత్ర కీలకం కానుంది. కాగా, అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 3,24,073 మంది ఓటర్లు ఉండగా.. తక్కువగా అశ్వారావుపేటలో 1,59,174మంది ఓటర్లు ఉన్నారు.

ఇన్‌చార్జ్ పాలనలో..

- రెగ్యులర్ రవాణాశాఖాధికారి లేక ఇబ్బందులు
- భద్రాచలం ఎంవీఐకి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు


కొత్తగూడెం ఆర్‌టీఓ కార్యాలయంలో బారులుదీరిన వాహనదారులు

కొత్తగూడెంటౌన్: జిల్లా రవాణా అధికారిగా భద్రాచలం రవాణా అధికారి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండటం, రెగ్యులర్ అధికారి లేకపోవడంతో కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపుగా 36 రోజులుగా ఇన్‌చార్జ్ పాలనలోనే కార్యాలయం కొనసాగుతోంది. జిల్లా రవాణా శాఖ(ఆర్‌టీఓ) కార్యాలయంలో ఉన్నతాధికారి లేకుండానే పరిపాలన కొనసాగుతోంది. 36 రోజులుగా జిల్లా రవాణాశాఖకు సంబంధించి ఉన్నతాధికారి పోస్టు ఇంకా భర్తీకాలేదు. మార్చి 19న బదిలీలు జరగడంతో ఇక్కడి అధికారి పి.వేణు సిద్దిపేటకు వెళ్లారు. అప్పటి నుంచి మరో అధికారి చేరలేదు. భద్రాచలం ఎంవీఐగా పనిచేస్తున్న టి.కిషన్‌రావుకు ఇన్‌చార్జ్ రవాణాశాఖాధికారిగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, పినపాక, అశ్వారావుపేట, దమ్మ పేటతో పాటు పలు ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు సంబంధించి లైసెన్స్‌లతోపాటు అనుమతి ఇవ్వాలన్నా, రద్దు చేయాలన్నా ఆర్‌టీఓ స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాల్సి ఉంది. కొత్తగూడెం, భద్రాచలంను రెండు యూనిట్లుగా మార్చగా వాటిలో ఎంవీఐ స్థానంలో ఉన్న అధికారి వాహనదారుల లైసెన్స్‌లు, బ్యాడ్జీలు, ఇతర పనులకు అనుమతి ఇస్తున్నప్పటికీ ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులకు సంబంధించిన పనులు కావాలంటే ఆర్‌టీఓ సంతకం తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. అయితే, ఉన్నతాధికారి సంతకం కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఆర్‌టీఓ కార్యాలయం వద్ద రోజురోజుకూ వందల సంఖ్యలో వాహనదారులు లైసెన్స్‌లు, బ్యాడ్జీలు, వాహన తనిఖీల కోసం వస్తున్నారు. రద్దీ ఎక్కువై పనులు పూర్తి కావడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పడుతోంది. గంట పని కోసం వచ్చి గంటల పాటు ఎదురుచూడాల్సి వస్తోందని, చాలాదూరం నుంచి ఎండలో వచ్చి ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

మార్చిలో బదిలీలు.. లీల్లో...

గత నెల 19వ తేదీన జరిగిన బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్‌టీఓ పెరుంబదర్ వేణు సిద్దిపేటకు బదిలీపై వెళ్లారు. కొత్తగూడెంలో ఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న జయపాల్‌రెడ్డి మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. జగిత్యాల నుంచి భద్రాద్రి కొత్తగూడెం ఎంవీఐగా వెలసరి వెంకటరమణ విధుల్లో చేరారు. కానీ, జిల్లా ఆర్టీఓగా ఎవరినీ నియమించలేదు. దాదాపు 36 రోజులుగా రవాణా శాఖ అధికారి లేకుండానే ఇన్‌చార్జ్‌తోనే నెట్టుకొస్తున్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు

- మద్యం, డబ్బుల రవాణాను అరికట్టాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్ గోపాల్


సూచనలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్‌గోపాల్

భద్రాచలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్ గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన భద్రాచలంలో పర్యటించారు. ఐటీడీఏరోడ్, చర్ల, కూనవరం రోడ్డు, ఎస్ఎస్‌టీ, బ్రిడ్జి సెంటర్లలోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, సలహాలు, సూచనలిచ్చారు. చెక్‌పోస్టుల వద్ద పనిచేసే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, ఆధారం లేని నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే బహుమతులు, అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు నామినేషన్ దాఖలు తేదీ నుంచి పోలింగ్ జరిగే తేదీ వరకు వారి వ్యయ లెక్కలను పరిశీలక బృందాలు పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాలకు తప్పనిసరిగా ముందుగా అనుమతి పొందిన వాహనాలు మాత్రమే ఉండాలని, అనుమతి లేకుండా ప్రచార వాహనాలను తిప్పినా, సభలు, ర్యాలీలు నిర్వహించినా ఈసీ నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఆయన తొలుత రామాలయంలో సీతారాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ ఆఫీసర్ వేల్పుల శ్రీనివాసరావు, లైజనింగ్ ఆఫీసర్ పృథ్వీరాజ్, సీఐ సంజీవరావు, ఎఫ్ఎస్‌టీ బృందం అధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలు స్వాధీనం

మణుగూరులో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.4 లక్షల సీజ్


డబ్బును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగిస్తున్న సీఐ

మణుగూరుటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌తో పాటు, హనుమాన్ జంక్షన్ వద్ద సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4 లక్షలు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు తెలిపారు. ఎస్ఐ రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

ఇల్లెందులో రూ.లక్ష ...

ఇల్లెందు: ఎన్నికల వేళ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం డిగ్రీ కాలేజ్ వద్ద డీఎస్పీ చంద్రభాను, సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎస్28టీఏ5803 వాహనంలో రూ.లక్ష నగదు దొరికింది. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం జీపీ వేపలగడ్డ తండాకు చెందిన భూక్యా ప్రశాంత్ ఆ డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేశారు.


ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే 'అమ్మయ్య. మా జోలికి రావడం లేదు' అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవలు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్లు-దూకుళ్లు, నేల-బండ, ఏడుపెంకులాట, పులి-మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాలయ్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:

పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మన్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.

వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

'సిఐఎ'లో అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్' పోటీల్లో పాల్గొనడం దేవిక కేరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ 'గాబ్రియెల్' రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఏ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే


దేవిక మన్‌చందానీ

అవకాశం దేవికకు వచ్చింది. 'పాత్ వేస్ టు ఎక్స్‌లెన్స్' అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. 'ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు' అంటుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ' రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేత పాత్ర పోషించిన దేవిక 'బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్'కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మన్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి, వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక.



'ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే 'ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను' అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

'లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి' అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ 'పేస్ట్రీ చెఫ్'గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



'భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం' అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ 'ఐఎన్‌ఎస్వీ' తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. 'తరిణి' నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్‌ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

'ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది' అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం.

సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

'ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే' అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం


దిల్నా రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ. క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రోటీన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్ల. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్‌ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్‌ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 'సాగర్ పరిక్రమ' అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

'సాహసం' లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. 'సాగర్ పరిక్రమ'లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది అభిరుచిని మెరుగుపరచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది. కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు. ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి. తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది. అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది. వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి, సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది. ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్


సవిత


వర్క్‌షాప్

"డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునే దాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయిన్‌బుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండే దాన్ని.

ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసే దాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.







ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయిన్‌బుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం 'టింక్టోరియా' పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.

అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది' అని ఆనందంగా వివరిస్తారు సవిత.


మోడల్

– నిర్మలారెడ్డి